

### సమగ్ర వివరాలు అందించండి

ఎస్సీ ఉప కులాల స్థితిగతులపై సమగ్ర వివరాలు అందించాలని ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆదేశించారు.


8లో



### రూ.లక్ష విరాళం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో అన్న దానానికి గున్నపు సత్యవతి (సామర్లకోట) తన మనవడు ప్రదీప్‌కుమార్ పేరిట గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు.

### డెల్టాలకు 11,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 11,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వీటిలో తూర్పు డెల్టాకు 3,900, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులుగా ఉంది.

## న్యూస్‌రీల్

### విద్యార్థి స్థాయి ఆధారంగా బోధన

– డీఈఓ సలీం బాషా

ముమ్మిడివరం: విద్యార్థి స్థాయి ఆధారంగా బోధన చేసినప్పుడే అభ్యాసన స్థాయిలు మెరుగు పడతాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. ముమ్మిడివరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ డీఆర్పీ పునశ్చరణ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు బోధనలో నైతిక విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆసక్తికరంగా బోధన చేసినప్పుడే పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరుగుతాయన్నారు. అంకితభావంతో విధి నిర్వహణ చేసిన ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఝాన్సీ రాణి, కోర్స్ కోఆర్డినేటర్ బి.రమణశ్రీ, సమగ్ర శిక్ష అకడమిక్ మానటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడారు. జిల్లాలో 22 మండలాల నుంచి 62 మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, 54 మంది అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శిక్షణలో పాల్గొన్నారు. డైట్ లెక్చరర్ కళావతి, ఐసీడీఎస్ పీఓ విజయశ్రీ, డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు, ఎంఈఓ2 ఆర్.ఉదయ భాస్కరరావు, పాఠశాల హెచ్ఎం సీహెచ్ పరిమళ పాల్గొన్నారు.

### రత్నగిరిపై భక్తుల రద్దీ



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు

అన్నవరం: పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో రత్నగిరి సత్యదేవుని ఆలయ ప్రాంగణం గురువారం కిక్కిరిసిపోయింది. టూరిస్టు బస్సులు, వివిధ వాహనాల్లో శబరిమల వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో సత్యదేవుని దర్శించుకున్నారు. వీరికి ఇతర భక్తులు కూడా తోడవడంతో ఆలయ ప్రాంగణంలో రద్దీ ఏర్పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయం ప్రాంగణం, వ్రత మండపాలు భక్తజనసందోహంతో నిండిపోయాయి. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా వేశారు. స్వామి వారిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. సత్యదేవుని వ్రతాలు 1,200 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

**సత్యదేవుని నిజరూప దర్శనం**

రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుడు భక్తులకు నిజరూపంలో దర్శనమిచ్చారు. ప్రతి రోజూ పట్టు వస్త్రాలు, స్వర్ణ, వజ్రాభరణాలతో దర్శనమిచ్చే స్వామి, అమ్మవారు, శంకరుల మూలవిరాట్టులను పుష్పమాలలతో మాత్రమే అలంకరించారు.

**నేడు చండీహోమం**

రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ హోమం, అనంతరం పూర్ణాహుతి నిర్వహిస్తారు. రూ.750 టికెట్టుతో భక్తులు ఈ హోమంలో పాల్గొనవచ్చు.

### శ్రీపాద శ్రీవల్లభుని హుండీ ఆదాయం రూ 22 లక్షలు

పిఠాపురం: పట్టణంలోని ప్రముఖ దత్త క్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానానికి హుండీల ద్వారా రూ 22,05,551 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీదారు వి.ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యాన గురువారం హుండీల లెక్కింపు నిర్వహించారు. గత జూన్ 29 నుంచి ఇప్పటి వరకూ ఈ ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



### శివారుల్లో ప్రశ్నార్థకం

కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, అల్లవరం, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో రబీ వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. గత నెలాఖరు సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు వరిచేలు నీట మునిగాయి. నాటి నుంచి ముంపు వీడలేదు. శివారు చేలల్లో ఇప్పటికీ మూడు అడుగుల మేర ముంపునీరు ఉంది. మురుగునీటి కాలువ వ్యవస్థ అధ్వానంగా మారింది. మురుగునీటి కాలువలు సముద్రంలో కలిసే మొగలు మూసుకుపోయాయి. అందువల్ల చేలల్లో నీరు దిగడం లేదు. ముంపులో నారుమడులు వేస్తే మొదటికే ముప్పు అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది.

**రబీ సాగులో ఇలా:** వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు సఖినేటిపల్లి మండలం మోరిలో దెబ్బతిన్న వరి నారుమడి

# రబీ సాగేనా?

- డెల్టా శివార్లలో మూడు అడుగుల లోతు ముంపులో చేలు
- ఇదే సమయంలో మరోసారి వర్షాలు
- 10 వేల ఎకరాలలో సాగు సందిగ్ధం
- అధ్వానంగా మురుగునీటి కాలువలు
- పూడికతీతకు ఖర్చు చేయని కూటమి సర్కారు
- డిసెంబర్ 1న మొదలైన రబీ షెడ్యూల్
- ఇప్పటికీ ఐదు శాతం కూడా పూర్తికాని నారుమడులు



**ఖరీఫ్ సాగులో ఇలా:** ఫెంగల్ తుపాను వల్ల కురిసిన వర్షాలకు అల్లవరంలో మునిగిన వరి చేల నుంచి నీరు తోడుతున్న దృశ్యం (ఫైల్)

సాక్షి, అమలాపురం: ఏటా మూడు పంటలు పండే గోదావరి డెల్టాలో వరిసాగుకు ఉరి పడుతోంది. ప్రకృతి వైపరీత్యాలకు తోడు.. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం శివారు రైతులకు శాపంగా మారింది. డెల్టాలో గతంలో ఖరీఫ్ అంటే ముంపు.. రబీ అంటే నీటి ఎద్దడి అన్నట్టుగా ఉండేది. కాని ముంపునకు భయపడి తొలకరితోపాటు రబీ వదులు కోవాల్సిన దుస్థితి నెలకొంది.

గోదావరి డెల్టాలో రబీసాగు షెడ్యూల్ డిసెంబర్ ఒకటి నుంచి మొదలైంది. జిల్లాలో తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో సుమారు 1.60 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరుగుతుందని అంచనా. ఈ ఏడాది రబీకి నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం లేదని అధికారులు ధీమాతో ఉన్నారు. అయినా రబీపై రైతులకు భరోసా కలగడం లేదు. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 918 ఎకరాల్లో నారుమడులు (22,950 ఎకరాలకు సరిపడా నారుమడులు) పడగా, కేవలం 2,276 ఎకరాల్లో వెదజల్లు పడింది. అంటే మొత్తం మీద 25,226 ఎకరాల్లో రబీ మొదలైనట్టు అంచనా. మొత్తం ఆయకట్టులో 15 శాతం మాత్రమే సాగు మొదలైంది.

**నాడు వెన్నెంటే ఉంటామంటూ వెన్ను విరిచారు**

ఈ ఏడాది ఆగస్టు నెలలో డెల్టాలోని శివారు ప్రాంతాల్లో తొలకరి (ఖరీఫ్) సాగుకు రైతులు దూరంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన ప్రజాప్రతినిధులు.. జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగి డ్రెయిన్లలో పూడిక తొలగిస్తామని, ముంపునీరు దిగేందుకు చర్యలు తీసుకుంటామని హామీలు గుప్పించారు. నాటి నుంచి నేటి వరకు నయాపైసా కూడా ఖర్చు చేయలేదు. సుమారు 30 వేల ఎకరాల ఆయకట్టు ముంపునీరు దిగే కూనవరం మొగ వద్ద డ్రెడ్జింగ్ చేస్తామని చెప్పి రెండు డ్రెడ్జర్లు తెచ్చారు. కాలువలో నాలుగు నెలలుగా ప్రదర్శనగా ఉంచారే తప్ప పట్టుమని గంట సేపు డ్రెడ్జింగ్ చేసిన దాఖలాలు లేవు. పరిపాలనా పరమైన అనుమతులు రాలేదని సాగునీటి పారుదల శాఖ అధికారులు అప్పటి నుంచి ఇప్పటి వరకు చెబుతూనే ఉండడం గమనార్హం. వీరి మాటల మీద నమ్మకం లేక సాగు చేయని రైతులు ఖరీఫ్ నష్టాల బారిన పడకుండా తప్పించుకోవడం ఇక్కడ గమనార్హం. రబీ సమయంలోనైనా ముంపు నీరు దిగేందుకు.. పంట కాలువల్లో పూడిక, గుర్రపుడెక్క తొలగించి మెరక ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారా అంటే అదీ లేదు.

### పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు

సఖినేటిపల్లి మండలం మోరి గ్రామ శివారు నక్కపారలో సుమారు 2 వేల ఎకరాల్లో ఆయకట్టు ఉంది. రబీ సమయంలో ముంపు ఉండడం ఇదే తొలిసారి. చేలల్లో గుర్రపుడెక్క, తూడు పేరుకుపోయింది. పిల్లి అడుగుల పార జాతి రకం తూడు సైతం రైతులను ముప్పుతిప్పలు పెడుతోంది. ఇక్కడ కొంతమంది రైతులు నారుమడులు వేసినా తాజా వర్షాలకు దెబ్బతింది. మొలక శాతం లేకపోవడానికి తోడు, వర్షాలు విత్తనం చెదిరి మొలక రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్వేదికర, కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు, గొంది, మలికిపురం మండలం చింతలమోరి, పడమాటిపాలెం, శంకరగుప్తం వంటి ప్రాంతాల్లో చేలు ఇంకా ముంపులోనే ఉన్నాయి.



సఖినేటిపల్లి మండలం నక్కల పర్రలో చెరువులుగా మారి రబీ నారుమడులకు అనుకూలంగా లేని వరిచేలు

### రబీ మొదట్లోనే దెబ్బ తినేశాం



నేను కౌలుకు తీసుకుని రెండు ఎకరాల్లో రబీసాగు మొదలు పెట్టాను. చేలల్లో నీరు దిగడం లేదు. మడి తయారు చేసి విత్తనాలు జల్లినా పూర్తిస్థాయిలో మొలక రాలేదు. విత్తనం నాసిరకంతో పాటు వర్షాలకు విత్తనం తిరగబడి మొలక దెబ్బతింది. రబీ మొదట్లోనే దెబ్బతినేశాం.

– డి.ఏడుకొండలు, రైతు, మోరి, సఖినేటిపల్లి మండలం



**ప్రదర్శనకు తెచ్చినట్టుగా:** కూనవరం మేజర్ డ్రెయిన్‌లో నాలుగు నెలల నుంచి నిరుపయోగంగా పడి ఉన్న డ్రెడ్జర్

## చెరువులను తలపిస్తున్న వరి చేలు



ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లిలో చెరువులను తలపిస్తున్న వరిచేలు

అమలాపురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి, ఎస్.యానాం, చల్లపల్లి, కూనవరం, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం, రాఘవులపేటల్లో వరిచేలు చెరువులను తలపిస్తున్నాయి. తామరపువ్వులు పూస్తున్న ఈ చేలను చూస్తే ఇవి వరిచేలు అంటే కొత్తవారికి నమ్మశక్యం కాదు. ఈ ప్రాంతాలలో ఇప్పటి వరకు ఖరీఫ్ మాత్రమే సాగు లేకుండా పోగా, ఇక నుంచి రబీ సైతం కష్టమనే అభిప్రాయానికి రైతులు వచ్చారు. ఈ గ్రామాల్లో మొత్తం 3,500 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. ఇప్పటి వరకు పది శాతం కూడా ఖరీఫ్ లేదు. తొలకరి ఊడ్చని వారు రబీ ముందుగా మొదలు పెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేదు. అల్లవరం రెల్లుగడ్డ, ఎంట్రికోన, అల్లవరం, కొమరగిరిపట్నం, తుమ్మలపల్లి, కాట్రేనికోన మండలం వేట్లపాలెం, మొక్కల తిప్ప, సత్తెమ్మచెట్టు ప్రాంతాల్లో 2,500 ఎకరాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

### రెండో పంట కూడా వదులుకుంటే నష్టపోతా



నేను సొంతం రెండు, కౌలుకు రెండు ఎకరాలు సాగు చేస్తున్నాను. తొలకరి సాగు చేయ లేదు. రెండో పంట కూడా వదిలేస్తే నష్టపోతా. గొరగన మూడి డ్రెయిన్ నుంచి కూనవరం, కూనవరం మేజర్ డ్రెయిన్ నుంచి సముద్రంలోకి నీరు దిగడం లేదు. ప్రభుత్వం మురుగునీటి కాలువలను బాగు చేయాలి.

–నల్లా వెంకటేశ్వరరావు, వానపల్లిపాలెం,ఉప్పలగుప్తం మండలం

## అక్రమార్కులపై కేసులు

**ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, బ్లాక్ మార్కెట్ చేసేవారిపై కేసులు బనాయించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్ కమిటీ సభ్యులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏజెన్సీ రోజూ కనీసం 500 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు నిర్వహించాలని అంతకన్నా తక్కువ స్థాయిలో తవ్వకాలు నిర్వహిస్తే ఏజెన్సీని రద్దు చేస్తామన్నారు. భవన నిర్మాణ రంగానికి ఊతం ఇచ్చే దిశగా డిమాండ్‌కు అనుగుణంగా ఉచిత ఇసుక సరఫరా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కొత్తగా గుర్తించిన ఇసుక రీచ్‌ల అనుమతులు గురించి, పట్టా భూములలో ఇసుక తవ్వకాల నిర్వహణపై చర్చించారు. చింతలూరులంక, మల్లేశ్వరం రీచ్ నుంచి ఇసుక తవ్వకాల నిర్వహణకు టాస్క్‌ఫోర్స్ బృందాల బలోపేతం, ఇసుక లభ్యత, సరఫరా అంశాల పురోగతిపై సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం ఎనిమిది రీచ్‌లలో మనుషుల ద్వారా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటిలో పులిదిండి, ఆత్రేయపురం, ఊబలంక, వద్దిపర్రు -2, పొడగట్లపల్లి, అంకంపాలెం -2, నార్కెట్‌మిల్లి కపిలేశ్వరపురం ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నా యన్నారు. నూతనంగా వశిష్ట గౌతమి నదులలో పేరవరం, వెలిచేరు, రాజవరం, గోపాలపురం 1,2, మెర్లపాలెం, తాడిపూడి రీచ్‌లను గుర్తించామన్నారు. లారీలు, ట్రాక్టర్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి నిర్దేశిత ధరలు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాసరావును ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా గనులు భూగర్భ శాఖ ఏడీఎల్ వంశీధర్‌రెడ్డి, ఆర్డీవోలు పి.శ్రీకర్, డి అఖిల, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీపీఓ శాంతలక్ష్మి, ఆర్ అండ్‌బీ ఎస్ఈ బి.రాము, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్ ఎన్వీ కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ విజయ్ పాల్గొన్నారు.

## భూముల మార్కెట్ విలువ సవరించే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లాలో జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల మార్కెట్ విలువలు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సవరించడానికి చర్యలు చేపట్టినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి పేర్కొన్నారు గురువారం ఆమె కలెక్టరేట్‌లో డీఐజీ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్లు, జెడ్పీ సీఈఓ, డీఎల్‌డీఓలతో సమావేశం నిర్వహించి భూముల మార్కెట్ విలువల సవరణకు సంబంధించిన విధి విధానాలపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా రిజిస్ట్రార్ మరియు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో భూ మార్కెట్ విలువల సవరించిన ముసాయిదా జాబితాలను ప్రదర్శిస్తామని, వీటిపై అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈ అభ్యంతరాలను పరిశీలించి, సవరించిన తుది జాబితాను రూపొందిస్తామని చెప్పారు. సవరించిన భూమి మార్కెట్ విలువలు 2025 జనవరి ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఐజి రిజిస్టర్ బి శివరాం, జిల్లా రిజిస్టర్ సీహెచ్ నాగలింగేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈవో, రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, డిఎల్ డీవో ఎస్. త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

**అధికారులతో సమీక్ష**

ఈ నెల 24వ తేదీన జరిగే జాతీయ వినియోగదారుల దినోత్సవం వైభవంగా నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పౌరసరఫరాల అధికారులతో సమావేశం నిర్వహించి 24న నిర్వహించనున్న జాతీయ వినియోగదారుల దినోత్సవ సన్నద్ధతపై సమీక్షించారు. వినియోగదారుల హక్కుల రక్షణ ఎంతో అవసరమని తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ బాల సరస్వతి, సహాయ సరఫరా అధికారి శరత్, సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు అరిగెల బలరామూర్తి, అమరేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఏకసభ్య కమిషన్‌కు వినతులు



ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా దళిత వేదిక ప్రతినిధులు

- ఎస్సీ వర్గీకరణపై వ్యతిరేకత వ్యక్తం చేసిన వైనం
- జిల్లా నుంచి కాకినాడకు తరలి వెళ్లిన మాల నేతలు

అమలాపురం టౌన్: ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం వేసిన ఏకసభ్య కమిషన్‌కు గురువారం జిల్లాలోని 22 మండలాల నుంచి మాల నాయకులు తమ అభ్యంతరాలను వినతి పత్రాల రూపంలో తెలియజేశారు. కాకినాడ కలెక్టరేట్‌లో కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలసి నాయకులు మాట్లాడారు. కులగణన చేపట్టిన తర్వాతే వర్గీకరణపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని సూచించారు. పార్లమెంట్‌లో మెజార్టీ, రాష్ట్రపతి ఆమోదంతో వర్గీకరణపై ముందుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అలాకాని పక్షంలో తాము ప్రజా ఉద్యమాల ద్వారా వర్గీకరణను అడ్డుకుంటామని జిల్లా దళిత ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబారావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు స్పష్టం చేశారు. వర్గీకరణ అనేది మాల మాదిగలను విడదీసే రాజకీయ కుట్ర అని, ప్రభుత్వం వేసిన ఏకసభ్య కమిషన్ రాజ్యాంగ విరుద్ధమని, దానిని రద్దు చేయాలని కమిషన్ ముందు తమ డిమాండ్‌ను వినిపించినట్టు వారు తెలిపారు. గొల్లపల్లి డేవిడ్‌రాజు, నెల్లి లక్ష్మీపతి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాల మహానాడు కన్వీనర్ చీకురుమిల్లి కిరణ్‌కుమార్ కమిషన్‌కు వినతి పత్రాలు అందించారు.

## ప్రసాద్.. మరింత జాప్యం





అన్నవరం: దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పదేళ్ల క్రితం ప్రారంభించిన పిలిగ్రిమేజ్ రీజువినేషన్ అండ్ స్పిరిచ్యువల్ అగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీము పనులు మరింత జాప్యం కానున్నాయి. వైఎస్సార్ సీపీకి చెందిన అప్పటి కాకినాడ ఎంపీ వంగా గీత, నాటి ప్రజాప్రతినిధుల చొరవతో అన్నవరం దేవస్థానం గతంలోనే ప్రసాద్ పథకానికి ఎంపికైంది. ఈ పదేళ్లలో ఎన్నో అవాంతరాలు దాటుకుని, చివరకు సుమారు రూ.20 కోట్లతో రత్నగిరిపై వివిధ నిర్మాణాలు చేపట్టేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది.

**'ప్రసాద్'తో చేపట్టే పనులివీ..**

- ప్రసాద్ నిధులతో అన్నవరం దేవస్థానంలో పలు పనులు చేపట్టాలని గతంలోనే నిర్ణయించారు. ఆ మేరకు గత మార్చి ఏడో తేదీన ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ కశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి ఈ పనులకు లాంఛనంగా శ్రీకారం చుట్టారు.
- దేవస్థానంలోని పాత టీటీడీ భవనం స్థలంలో రూ.10 కోట్లతో రెండంతస్తుల్లో అన్నదాన భవనం నిర్మించాలని నిర్ణయించారు.
- అన్నదాన భవనం పక్కనే రూ.6 కోట్లతో క్యూ కాంప్లెక్స్ నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేశారు.
- ప్రకాష్ సదన్ భవనం వెనుక ఉన్న ప్రస్తుత పార్కింగ్ స్థలంలో రూ.3 కోట్లతో పురుషులు, మహిళలకు విడిగా టాయిలెట్ల బ్లాక్‌లు నిర్మించాలని నిర్ణయించారు.
- సత్రాల నుంచి ఆలయానికి, వ్రత మండపాల మధ్య భక్తులు రాకపోకలకు రూ.కోటితో రెండు బ్యాటరీ కార్లు నడపాలని ప్రణాళిక రూపొందించారు.

**టెండర్ల రద్దు అందుకేనా!**

ఈ పనుల కోసం గత అక్టోబర్ 3న టెండర్లు పిలిచారు. అదే నెల 25న తెరచి, ఖరారు చేయాల్సి ఉండగా.. ఆ పని జరగలేదు. ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా జరిగిన ఈ టెండర్ల ప్రక్రియలో టెక్నికల్ బిడ్‌లో అర్హత సాధించి, ఫైనాన్షియల్ బిడ్‌లో లోయెస్ట్ కొటేషన్ దాఖలు చేసిన వారికే ఖరారు చేయాలి. ఈ టెండర్లలో 12 నిర్మాణ సంస్థలు పాల్గొన్నాయి. ఒకటి రాష్ట్ర మంత్రికి చెందినది అని, దానికి ఈ టెండర్లు కట్టబెట్టేందుకే పర్యాటక అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని విమర్శలు వచ్చాయి. నిధులు విడుదల కాక టెండర్లు తెరవలేని ఇన్నాళ్లూ చెప్పిన అధికారులు తాజాగా నిధులు విడుదలయ్యాయని, గత టెండర్లు కాలపరిమితి ముగిసినందున వాటిని రద్దు చేస్తామని అంటున్నారు.

## అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

**అమలాపురంలో ప్రజా సంఘాల ధర్నా**



అమలాపురంలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవహేళన చూస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ధర్నా జరిగింది. తక్షణమే కేంద్ర మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్), వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వాతోపాటు పలు దళిత సంఘాలు ఈ ధర్నా చేపట్టాయి. కేంద్రంలో బీజేపీ మతోన్మాదంతో ఉందని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల తులసీరావు ఆరోపించారు. అమిత్ షా వ్యాఖ్యలను ప్రజలు, ప్రజా తంత్ర వాదులంతా తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు బీజేపీ అంబేడ్కర్ జపం చేసి అధికారం వచ్చాక ఆయన పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ధర్నాలో పలు ప్రజా సంఘాల ప్రతినిధులు జి.హరీష్‌కుమార్, పాలమూరు శ్రీనివాసరావు, జి.మురళీ విజయ బాలకృష్ణ, దైవరాణి పాల్గొన్నారు.

## అంబాజీపేట కొబ్బరి మార్కెట్



| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్తకొబ్బరి (క్వింటాల్) | 12,000 – 12,500 |
| కొత్తకొబ్బరి (రెండవ రకం) | 9,500 – 10,000 |
| **కురిడీ కొబ్బరి (పాతవి)** | |
| గండేరా (వెయ్యి) | 17,500 |
| గటగట (వెయ్యి) | 16,000 |
| **కురిడీ కొబ్బరి (కొత్తవి)** | |
| గండేరా (వెయ్యి) | 16,500 |
| గటగట (వెయ్యి) | 15,000 |
| నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 13,000 – 14,000 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 10,000 – 11,000 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 3,750 |
| ఒక కిలో | 260 |

# యంత్రాలతో సాగు.. ఎంతో బాగు

- సమయం, ఖర్చు ఆదా
- ఎకరానికి రూ.5 వేల నుంచి రూ.10 వేల మిగులు

**పెరవలి:** రబీ సాగుకి సమయం తక్కువగా ఉండటంతో రైతులు యంత్రాలతో విత్తనాలు చల్లటం, వరి నాట్లు వేయడం వల్ల అనుకున్న సమయానికి పంట చేతికి అందుతుందని వ్యవసాయాధికారి మేరీ కిరణ్ తెలిపారు. యంత్రాలతో సాగు చేయటం వల్ల పెట్టుబడులు తగ్గి లాభాలు పొందవచ్చన్నారు. ఇందుకోసం వరిసాగు చేయడానికి విత్తనాల దగ్గర నుంచి కోత కోసే వరకు యంత్రాలను వినియోగించుకుంటే లాభం రావడంతో పాటు వ్యయం తగ్గుతుందని వివరించారు. రైతులు వరికోత యంత్రాలనే వినియోగిస్తున్నారు తప్ప విత్తనాలు వేయడానికి, నాట్లు వేయడానికి మాత్రం యంత్రాలపై మక్కువ చూపడం లేదు. దీంతో వ్యయం పెరిగి ఆదాయం తగ్గుతోందన్నారు. యంత్రాలతో సాగు చేస్తే రైతుకి అన్ని విధాలా మేలని, అందుకోసం యంత్రాల ఉపయోగాలు, వాటి వల్ల రైతులకు కలిగే లాభాలను ఆమె వివరించారు.

**పాడి-పంట**

**డ్రమ్ సీడర్**

డ్రమ్ సీడర్‌తో విత్తనాలు నాటుకుంటే కుదుర్లు ఎక్కువ ఏర్పడి దిగుబడి పెరుగుతుందని, కూలీల ఖర్చు తగ్గుతుందని చెప్పారు. ఎకరం చేనుకి 8 నుంచి 10 కిలోల విత్తనాలు సరిపోతాయి. డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేసే రైతులు ట్రాక్టర్‌కు రోటోవీటర్‌ను అమర్చి దమ్ము చేసి నేలను చదును చేయాలి. నీరు కొద్దిగా ఉంచి కోర వచ్చిన విత్తనాలను డ్రమ్ముల్లో వేసి నాటాలి.

డ్రమ్ సీడర్‌లో నాలుగు డ్రమ్‌లు ఉంటాయి. ఒక్కొక్క డ్రమ్‌లో ఒక కిలో చొప్పున విత్తనాలు వేస్తే 10 నుంచి 12 సెంటీమీటర్ల ఎడంతో విత్తనాలు పడతాయి. డ్రమ్ములకు అమర్చిన రంధ్రాల ద్వారా నాలుగు నుంచి ఏడు విత్తనాలు ఒకేచోట పడతాయి. డ్రమ్ సీడర్ లాగినప్పుడు లైనుకి లైనుకి మధ్య 22 సెంటీమీటర్ల వ్యత్యాసం ఉంటుందని చెప్పారు. చేలో నాట్లు సక్రమంగా రావాలంటే డ్రమ్ సీడర్ తాడును నిదానంగా లాగి, ఆ పక్కనుంచే డ్రమ్‌సీడర్‌ను తీసుకువెళ్తే వరుసలు సక్రమంగా ఉంటాయి. డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు చల్లడం వల్ల ఎకరానికి 20 కిలోల విత్తనాలు ఆదా అవుతాయి. డ్రమ్ము సీడర్‌తో విత్తనాలు వేసిన చేలలో దుబ్బు బాగా చేసి వారం ముందే కోతలకు వస్తాయి. చీడపీడల సమస్య తక్కువగా ఉండి దిగుబడి 3 నుంచి 5 బస్తాలు ఎక్కువగా ఉంటుంది.



ఉసులుమర్రులో నాట్ల కోసం దమ్ము చేసిన చేనును చదును చేస్తున్న రైతు



ఖండవల్లిలో డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేస్తున్న రైతులు



ఉసులుమర్రులో వరి నాట్లు వేస్తున్న యంత్రం

దీనివల్ల ఎకరానికి రూ.5వేలు ఖర్చు తగ్గుతుంది.

**ఊడ్పు యంత్రం**

ఊడ్పు యంత్రంతో వరినాట్లు వేస్తే మంచి ఫలితాలు వస్తాయి. ఇందుకోసం ప్రత్యేక ట్రేలలో విత్తనాలను మడి కట్టుకోవాలి. ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. ట్రేలలో కట్టిన మడిలో 14 నుంచి 16 రోజుల్లో మొలకలు వస్తాయి. వీటిని నేరుగా ఊడ్పు యంత్రాలలో అమర్చితే నాట్లు అవే వేస్తాయి. ఊడ్పు యంత్రాల్లో రెండు రకాలు ఉన్నాయి. నడుస్తూ తీసుకువెళ్లే యంత్రం ఒకటి, నడుపుకునే యంత్రం ఒకటి. నడుస్తూ తీసుకువెళ్లే యంత్రం ద్వారా రోజుకి 3 నుంచి 4 ఎకరాల్లో నాట్లు వేయవచ్చు. నడుపుకునే యంత్రం ద్వారా 8 నుంచి 10 ఎకరాల్లో నాట్లు వేయవచ్చు. ఈ యంత్రాలు నాట్లు వేసేటప్పుడు 5 నుంచి 8 మొక్కలను ఒక కుదురుగా వేస్తాయి. మంచి దుబ్బు చేసి అధిక దిగుబడిని ఇస్తాయి. ఈ యంత్రం వల్ల కూలీల ఖర్చు తగ్గుతుందని ఆమె తెలిపారు.



మేరీ కిరణ్ వ్యవసాయాధికారి పెరవలి

## రూ.75 స్మారక నాణెం సేకరణ




**అమలాపురం టౌన్:** నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సీసీ) సంస్థ వజ్రోత్సవం సందర్భంగా ముంబై టంకశాల విడుదల చేసిన రూ.75 స్మారక నాణేన్ని అమలాపురానికి చెందిన పుత్సా కృష్ణ కామేశ్వర్ ప్రత్యేక ఆర్డర్‌పై సేకరించారు. 35 గ్రాముల బరువుతో ఉన్న ఈ నాణెం 50 శాతం వెండి, 40 శాతం రాగి, నికెల్, జింక్ చెరో 5 శాతంతో తయారు చేశారు. నాణెం ఓ వైపు నేషనల్ క్యాడెట్ కోర్ ఎంబ్లమ్, రెండో వైపు రూ.75 ముఖ విలువ ముద్రించారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి



నాగేంద్రరావు (ఫైల్)

**నిడదవోలు :** పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలో చినకాశిరేవు రైల్వే ట్రాక్ వద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్సై పి.అప్పారావు తెలిపిన వివరాల మేరకు..నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన రాకుర్తి నాగేంద్రరావు (55) రాజమహేంద్రవరం వి.స్టార్ హాస్పిటల్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. తన విధులు ముగించుకుని రైలు ఎక్కి నిడదవోలు ఇంటికి బయలుదేరాడు. నిడదవోలు పట్టణంలోని కాశిరేవు వద్ద ఔటర్‌లో రైలు ఆగిన తర్వాత కిందకు దిగిపోయాడు. మరో ట్రాక్ దాటుతుండగా విజయవాడ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య రాజారత్నం ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్లుప్తంగా

### మార్కులు తక్కువగా వస్తున్నాయని తల్లి మందలింపు

**కుమార్తె ఆత్మహత్యాయత్నం**

**కొత్తపల్లి:** పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తున్నాయని, బాగా చదవాలని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమార్తె ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం రమణక్కపేటలో చోటుచేసుకొంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రమణక్కపేటలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బాలిక పదో తరగతి చదువుతోంది. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తున్నాయని ఉపాధ్యాయులు బాలిక తల్లి సుభాషిణికి సమాచారం ఇచ్చారు. దీంతో ప్రతి రోజూ పాఠశాలకు వెళ్తున్నావు కదా! బాగా చదువుకోవాలని తల్లి గట్టిగా మందలించింది. దీనిని తట్టుకోలేక బాలిక గురువారం ఉదయం కూరగాయ పంటలకు కొట్టే పురుగుల మందు తాగింది. అది గమనించిన తల్లి స్థానికుల సహకారంతో కుమార్తెను అంబులెన్సులో కాకినాడ జీజీహెచ్‌కు తరలించింది. ఈ సంఘటనపై ఇంత వరకూ ఎటువంటి కేసూ నమోదు చేయలేదని పోలీసులు చెప్పారు.

# వైద్యురాలి నిర్లక్ష్యం.. రోగులకు ప్రాణసంకటం

**గోపాలపురం:** ప్రభుత్వ వైద్యురాలి నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు రోగులకు వైద్యం అందక నరక యాతన అనుభవించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన ఎలిపే ఇంద్రమ్మ ఇంటి వద్ద వేడి నీళ్ల పొయ్యి మీద నుంచి తీస్తుండగా అవి కాళ్లు, పొట్టపై పడటంతో 25 శాతం మేర కాలిపోయింది. ఆమెను కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి గోపాలపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకువచ్చారు. డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేరు. దీంతో చేసేది ఏమీలేక ఆసుపత్రిలోనే నరకయాతన అనుభవించినట్లు బాధితురాలు తెలిపింది. బుధవారం అర్ధరాత్రి సుమారు 2గంటల సమయంలో గోపాలపురం గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలికకు కడుపు నొప్పి రావడంతో సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ఆ సమయంలో కూడా డ్యూటీ డాక్టర్ లేరు. బాలికను ఉదయం డ్యూటీ డాక్టర్ వచ్చి కొవ్వూరు ఆసుపత్రికి తరలించారు. అన్నదేవరపేటకు చెందిన ఎలిపే ఇంద్రమ్మను గురువారం సాయంత్రం 4గంటలకు కొవ్వూరు ఆసుపత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అప్పటి డ్యూటీ డాక్టర్ ఉండ్రాజవరపు రాణికి షోకాజ్ నోటీసు జారీచేశామని గోపాలపురం ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.చైతన్య తెలిపారు. దానికి సమాధానం ఇవ్వకపోవడంతో జిల్లా ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.



గోపాలపురం సీహెచ్‌సీలో వైద్యం అందక కూర్చుని ఉన్న రోగి ఇంద్రమ్మ

# పీఈటీ కావడమే లక్ష్యం

- రిపబ్లిక్ డే పరేడ్‌కి ఎంపికైన 'నన్నయ' విద్యార్థి వెంకటరమణ



సుమ్మర్ల వెంకటరమణ

**రాజానగరం:** 'ఆటలంటే చిన్నతనం నుంచి ఎంతో ఇష్టం. అయితే సరైన ప్రోత్సాహం లభించేది కాదు. ఎలాగైనా సరే వ్యాయామ ఉపాధ్యాయుడినై (పీఈటీ) ఆసక్తి ఉన్న విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తయారు చేయాలనుకున్నాను' అంటున్నాడు రిపబ్లిక్ డే పరేడ్‌కి ఆదికవి నన్నయ యూనివర్సిటీ నుంచి ఎంపికైన ఎంపీఈడీ విద్యార్థి సుమ్మర్ల వెంకటరమణ. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ తన లక్ష్యాన్ని, జీవితంలో ఎదుర్కొన్న ఆటుపోట్లను వివరించాడు.

**ఐదుగురు యువకులలో ఒకడు**

దేశ రాజధాని ఢిల్లీలో వచ్చే నెల 26న జరిగే గణతంత్ర వేడుకల పరేడ్‌కి సంబంధించిన ప్రీ–ఆర్‌డీ క్యాంప్ మహారాష్ట్రలోని పూణే జరిగింది. రాష్ట్రం నుంచి 44 మంది యువతీ, యువకులు హాజరుకాగా, పరేడ్, కల్చరల్ పోటీలలో ప్రతిభ చూపిన 10 మంది (ఐదుగురు యువకులు, ఐదుగురు యువతులు) ఎంపికయ్యారు. ఆ ఐదుగురు యువకులలో 'నన్నయ' వర్సిటీ నుంచి వెంకటరమణ ఒకడు. నెలల వయసులోనే తండ్రి నాగరాజును పోగొట్టుకున్నాడు. తల్లి అప్పలకొండ కూలి పనులు చేస్తూ అన్నీ తానై ముగ్గురు పిల్లలను పెంచి, చదివించింది. అన్నయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా జాబ్ చేస్తున్నాడు, అక్కకు పెళ్లి చేశారు.

**చిన్నతనం నుంచి స్పోర్ట్సు అంటే ఇష్టం**

అడ్డతీగల మండలం, అరవైనాలుగు కొత్తూరుపాడుకు చెందిన ఈ విద్యార్థి రాజవొమ్మంగి మండలం బొర్లగూడెంలో ఉన్నత పాఠశాల విద్య వరకు చదువుకుని, చోడవరంలోని ఏపీఆర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుకున్నాడు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో బీఏ చదువుకుని, ఏలూరు సమీపంలోని గోపన్నపాలెంలో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) చేశాడు. ప్రస్తుతం నన్నయలో ఎంపీఈడీ ఫైనలియర్ చదువుతున్నాడు. స్పోర్ట్సు అంటే చిన్నతనం నుంచి ఆసక్తి ఉంది. అయితే సరైన ప్రోత్సాహం లభించేది కాదు. ఆ సమయంలో అవకాశం ఉన్నంత వరకు ఎక్కడ పోటీలు జరుగుతున్నాయని తెలిసినా వాటిలో పాల్గొనేవాడు. ఆ విధంగా ఉన్నత పాఠశాల స్థాయిలోనే 800 మీటర్లు, వెయ్యి మీటర్లు పరుగు పందెంలోను, కబడ్డీలోను, వాలీబాల్‌లోను బహుమతులతోపాటు ధ్రువీకరణ పత్రాలు అందుకున్నాడు. రిపబ్లిక్ డే పరేడ్‌లోనూ ప్రతిభను కనబరచి, యూనివర్సిటీ పేరును ఢిల్లీలో వినిపించాలనే ఆకాంక్షను వెంకటరమణ వెలిబుచ్చాడు.



మహారాష్ట్రలో జరిగిన ప్రీ పరేడ్ క్యాంప్‌లో రమణ

## అనారోగ్యంతో యువతి మృతి

**అంబాజీపేట:** అనారోగ్య కారణంగా ఓ యువతి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు అంబాజీపేట ఎస్సై కె.చిరంజీవి గురువారం విలేకరులకు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుల్లేటికుర్రుకు చెందిన గుత్తుల గీతా సంధ్య (22) ఈ నెల 18వ తేదీ ఉదయం ఇంటి వద్ద హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయింది. అపస్మారక స్థితికి చేరిన గీతా సంధ్యను కుటుంబీకులు అమలాపురం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె బుధవారం రాత్రి మృతి చెందిందని ఎస్సై తెలియజేశారు. మృతురాలి చిన్నాన్న గుత్తుల నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

# సమగ్ర వివరాలు అందించండి

- ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధికారులతో సమీక్ష

**కాకినాడ సిటీ:** ఎస్సీ ఉప కులాల వారీగా సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై కచ్చితమైన గణాంకాలతో సమగ్ర వివరాలను అందించాలని ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధికారులను కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా ఆయన గురువారం కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశపు హాలులో అధికారులతో సమీక్షించి, ఆయా ఉప కులాల ప్రజల నుంచి అభిప్రాయాలు, వినతులు, విజ్ఞప్తులను స్వీకరించారు. ఉమ్మడి జిల్లాలో భాగమైన నాలుగు జిల్లాలకు సంబంధించిన ఎస్సీలలోని ఉపకులాల జనాభా, వారి స్థితిగతులపై అధికారులతో చర్చించారు. సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ ప్రజల గణాంకాలను ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రంజన్ మిశ్రాకు వివరించారు. 2011 జనాభా గణాంకాల ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల మొత్తం జనాభా 52,85,824 మంది కాగా ఇందులో 9,57,302 మంది (18.11 శాతం) ఎస్సీ జనాభా ఉన్నారని కలెక్టర్ వివరించారు. ఉమ్మడి జిల్లాలో అక్షరాస్యత 70.50 శాతం ఉండగా, ఎస్సీ కులాల జనాభాలో అక్షరాస్యత 69.37 శాతంగా ఉందన్నారు. పురుషులలో 72.96 శాతం, మహిళలలో 65.79 శాతం అక్షరాస్యులుగా ఉన్నారని వివరించారు. ఎస్సీలలోని 59 ఉపకులాలకుగాను, జిల్లాలో 44 ఉపకులాల ప్రజలు ఉన్నారన్నారు. వీరిలో ప్రధానంగా 68,507 శాతం మాల, మాల అయ్యవారు వర్గం, 22.132 శాతం మాదిగ వర్గం, 4.873 శాతం ఆదిఆంధ్ర వర్గం, 1.556 శాతం రెల్లి వర్గం ప్రజలు ఉండగా మిగిలిన ఉప కులాలలో ఒకటి కంటే తక్కువ శాతం ఉన్నారని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతటా విస్తరించిన ఎస్సీ జనాభా, ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి అంశాలలో వారి స్థితిగతులను, ప్రభుత్వ పథకాల ద్వారా వారికి లభిస్తున్న తోడ్పాటు గురించి కలెక్టర్ షణ్మోహన్ కమిషన్‌కు వివరించారు. కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. 2011 జనాభా ఆధారంగా పూర్వ 13 జిల్లాల స్థాయిలో ఎస్సీలలోని 59 ఉపకులాల పరిస్థితులపై అధ్యయనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అధికారులు తమ శాఖలలో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగుల వివరాలను, కేడర్, ఉపకులాల వారీగా కచ్చితమైన గణాంకాలతో సమర్పించాలని కోరారు. జెడ్పీ సీఈవో, డీపీవోలు స్థానిక సంస్థలలో ఎస్సీల ప్రజాప్రాతినిధ్యంపై ఉపకులాల వారీగా సమాచారం అందజేయాలని కోరారు. విద్య, ఉపాధి రంగాల్లో ఉపకులాల వారీ సమాచారాన్ని, డీఈవో, డీఆర్‌డీఏ, మున్సిపాలిటీ, ఆర్టీసీ తదితర శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**311 వినతులు అందజేత**

అధికారులతో సమావేశం అనంతరం ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ వివిధ ఎస్సీ ఉపకులాలకు చెందిన ప్రజలు, సంఘాల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు, వినతులు, విజ్ఞాపనలను స్వీకరించారు. మొత్తం 311 వినతులు వివిధ షెడ్యూల్డ్ ఉప కులాల ప్రతినిధులు కమిషన్‌కు అందజేయగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి సుమారు 2,468 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు ఎస్సీ ఉపకుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, కులాల పునర్విభజనపై వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తులను పూర్తిగా చర్చించి తదుపరి చర్యల నిమిత్తం కమిషన్ ప్రభుత్వానికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాకినాడ రెవెన్యూ డివిజన్ అధికారి ఎస్ మల్లిబాబు, డీఎస్పీ రఘువీర్ విష్ణు, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి జేడీ జి.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ పి.జ్యోతిలక్ష్మీదేవి, రాజమహేంద్రవరం ఇన్‌చార్జి జేడీ ఎం.సందీప్, సూపరింటెండెంట్‌లు బి.దొర, శ్రీనివాసు, వివిధ సహాయ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా



ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి పత్రాలను అందజేస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

## అత్తవారింటికి వస్తూ.. అనంతలోకాలకు..

**రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి**

**రాజానగరం:** కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యక్తి, అత్తవారింట ఉన్న భార్యాపిల్లలను చూసేందుకు వస్తూ మృత్యువాత పడ్డాడు. అటుగా బైక్‌పై వెళుతున్న వ్యక్తిని లిఫ్ట్ అడిగి, ఎక్కాడు. అదే అతని పాలిట మృత్యువైంది. బైక్‌పై కొంతదూరం ప్రయాణించిన వారిద్దరూ అది అదుపు తప్పడంతో ప్రమాదానికి గురయ్యారు. అత్తవారింటికి వెళ్లేందుకు లిఫ్ట్ అడిగిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలో దివాన్‌చెరువు నుంచి శ్రీరామపురం వెళ్లే రోడ్డులో గురువారం జరిగిన ప్రమాదంలో కేశవరానికి చెందిన చుక్కా శ్రీను (38) మృతి చెందాడు. ఇంజినీరింగ్ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. కేశవరం నుంచి వచ్చిన చుక్కా శ్రీను శ్రీరామపురంలోని అత్తవారింటికి వెళ్లేందుకు దివాన్‌చెరువు సెంటర్‌లో వేచివున్నాడు. అదే సమయంలో అటుగా బైకుపై వెళ్తున్న ఇంజినీరింగ్ విద్యార్థిని లిఫ్ట్ అడిగాడు. ఇద్దరూ కలిసి బైకుపై ప్రయాణిస్తుండగా రోడ్డు మార్జిన్ సరిగా లేకపోవడంతో బైకు అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో బైకు వెనుక కూర్చున్న శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా నడుపుతున్న ఇంజినీరింగ్ విద్యార్థి తలకు, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని 108లో రాజమహేంద్రవరం చికిత్స నిమిత్తం తరలించారు. ఆ విద్యార్థి ముక్కినాడకు చెందిన జె. వెంకటేశ్వరరావుగా భావిస్తున్నారు. పాలచర్లలోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న అతను ఇంటికి వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. కాగా మృతిచెందిన శ్రీనుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసును బొమ్మూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నాణ్యమైన దిగుబడులకు కృషి

**రాజమహేంద్రవరం రూరల్:** రైతు ఉత్పాదక సంస్థల(ఎఫ్‌పీవో) ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, ఏఎస్‌ఆర్ జిల్లాల 17 రైతు ఉత్పాదక సంస్థల సభ్యుల రికార్డులను గురువారం హుకుంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు కార్యాలయంలో తనిఖీ చేశారు. వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన వ్యవసాయశాఖ అధికారులు ఎం.వెంకటేశ్వర్లు, కె.లక్ష్మీరెడ్డి సర్టిఫికేషన్ ఏజెన్సీ అధికారి యుగంధర్ సభ్యుల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ రైతు ఉత్పాదక సంఘాల ఉత్పత్తులను ప్రస్తుతం పరిశీలించి ప్రయోగశాలలకు పంపుతామని, అక్కడ సంతృప్తి చెందినట్లు నిర్ధారిస్తే ప్రపంచంలోని 122 దేశాలలో ఎక్కడైనా వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకునే అవకాశం ఉంటుందన్నారు. తగు మోతాదులో పురుగుమందుల అవశేషాలు ఉండి నాణ్యమైన దిగుబడులు లక్ష్యంగా రైతు ఉత్పాదక సంఘాలు సాగు చేయాలన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు డి.శ్రీనివాసరెడ్డి, కె.బాబూరావు, వివిధ జిల్లాల వ్యవసాయాధికారులు భీమరాజు, శాంతాఅలివ్, షేక్‌కాసిం, మేరీకిరణ్, ప్రశాంతి, రఘుకుమార్, రాబిన్‌సింగ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



హుకుంపేట సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

# జీజీహెచ్‌ను పరిశీలించిన ఎన్‌సీడీ బృందం

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** స్థానిక జీజీహెచ్ లోని ప్రివెంటివ్ అంకాలజీ ఓపీడీ 222 ను రాష్ట్ర ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ శ్యామల, డబ్ల్యూహెచ్ అధికారులు డాక్టర్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా నోటి కేన్సర్, గర్భాశయ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు, డాక్టర్ రోగులను ఎలా చూస్తున్నారు, అందిస్తున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రభ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల నుంచి వైద్యులు కేన్సర్ అనుమానిత కేసులను ఓపీడీ 222 రెఫరల్ కార్డుతో (పింక్ రంగు) పంపుతారని తెలిపారు. ఇక్కడ ప్రివెంటివ్ అంకాలజీ నోడల్ అధికారి ఓపీడీ డాక్టర్ ప్రశాంత్ పరిశీలించిన తరువాత రోగి లక్షణాలను గుర్తిస్తామన్నారు. అనంతరం దంత, సర్జరీ, గైనిక్ విభాగపు వైద్యుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారని తెలిపారు. వైద్య సేవలల్లో భాగంగా ప్రతి మంగళవారం, గురువారం కేన్సర్ వ్యాధి చూస్తారని తెలిపారు. పరీక్షలు చేయించుకున్న ప్రజలతో మాట్లాడి వారి ఫీడ్ బ్యాక్ తీసుకున్నట్టు చెప్పారు. జిల్లా ఎన్సీడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ హరిచంద్ర, డీపీఎంవో డాక్టర్ అభిషేక్, డాక్టర్ సుధీర్, డీపీవో సంధ్య, అలి బేగ్ పాల్గొన్నారు.



జీజీహెచ్‌ను పరిశీలించిన ఎన్‌సీడీ బృంద సభ్యులు